
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.1 , కనిష్ఠం 15.8



నిజామాబాద్
జిల్లా వార్తలు

శుక్రవారం 22 నవంబరు 2024



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

బీసీ కులగణన జరిగితేనే మన హక్కులు మనకు చెందుతాయి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన జరిగితేనే మన హక్కులు మనకు చెందుతాయని కులమే రక్ష, కులమే బలం, కులమే రేపటి ఆశ అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం నగరంలోని మేరు భవన్‌లో బీసీ కులగణనపై సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ బిడ్డ మహేష్‌కుమార్‌గౌడ్ టీపీసీసీ అధ్యక్షుడు కావడంతోనే రాష్ట్రంలో బీసీ కులగణన సాధ్యమైందన్నారు. దాదాపు వందేళ్ల తర్వాత బీసీ కులగణన జరుగుతుందని మనమెంతో మనకంత రిజర్వేషన్లు రావాలంటే ఈ కుల గణన జరగాల్సిందేనన్నారు. ఎస్సీ, ఎస్టీలు అంబేద్కర్ పుణ్యాన వారెంతో వారికి అంత రిజర్వేషన్లు వచ్చాయని కానీ పట్టుమని 8 శాతం కూడా లేని అగ్రవర్ణాలు 10 శాతం ఈడబ్ల్యుఎస్ పేరుతో రిజర్వేషన్లు సాధించారని అన్నారు. బీసీలు ఎవరికి వ్యతిరేకం కాదని బీసీలకు రాజ్యాంగ బద్ధ అధికారాలు లేవని అదేవిధంగా రాజకీయ అండదండలు లేకపోవడం వల్లే అన్యాయం జరుగుతుందన్నారు. ఎప్పుడో వందేళ్ల కిందట 1931లో బ్రిటిష్ వారు జరిపిన కులగణనలో బీసీలు 54 శాతం ఉన్నట్లు తేలిందని అప్పుడు కేవలం 30-40 కులాలు మాత్రమే బీసీ లిస్ట్‌లో ఉండేవని ఇప్పుడు దాదాపు 130 కులాలు ఉన్నాయని అన్నారు. దాదాపు జనాభాలో 60 శాతంకు పైగా బీసీలు ఉన్నామని మనమెంతో మనకు అంత వాటా దక్కాలంటే బీసీ కులగణన జరిగితేనే మన రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత వస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, కరిపె రవీందర్, దేవేందర్, పొల్కం గంగాకిషన్, కొయ్యాడ శంకర్, శ్రీలత, నారాయణరెడ్డి, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి



- జిల్లాలో పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- పెరిగిన చలి తీవ్రత
- గురువారం 15.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. రోజురోజుకూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలితో ప్రజలు వణుకుతున్నారు. ఎప్పుడూ డిసెంబరులో ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత ఉండేది. కానీ ఈసారి పదిహేను రోజుల ముందుగానే ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరిగింది. దీంతో సాయంత్రం 6గంటల నుంచే చల్లగాలులు వీస్తున్నాయి. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 8 అయితే చాలు ఇళ్ల నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు చలి మంటను ఆశ్రయిస్తున్నారు. వెచ్చని దుస్తులను ధరిస్తున్నారు. నవంబరులోనే చలి తీవ్రత ఇలాఉంటే డిసెంబరు, జనవరిలో ఎలా ఉంటుందోనని జనం బెంబేలెత్తి పోతున్నారు.



- నగరంలో చలిమంటలు కాగుతున్న ప్రజలు



- రోడ్డును కమ్మేసిన పొగ మంచు





సమాజ శ్రేయస్సు కోసం సంకల్పంతో పనిచేయాలి

- ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థకు కృషి చేయాలి
- దీక్షాంత్ పరేడ్‌లో ప్రదర్శన చాలా బాగుంది
- రాష్ట్ర ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్
- జానకంపేట సీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న 250 మంది నూతన కానిస్టేబుళ్లు

7







జిల్లాకు మరో నేషనల్ హైవే

నిజామాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాకు మరో నేషనల్ హైవే మంజూరైంది. మహారాష్ట్ర నుంచి జిల్లా మీదుగా ఛత్తీస్‌ఘడ్‌లోని జగదల్‌పూర్ వరకు ఈ రోడ్డు నిర్మాణం అవుతుంది. ఇప్పటికే కొన్ని జిల్లాల పరిధిలో ఈ నేషనల్ హైవే నాలుగు లైన్‌ల రోడ్డు నిర్మాణం కాగా జిల్లాలో చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు 133 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే భూసేకరణ కోసం నోటిఫికేషన్ ఇవ్వడంతో పాటు భూముల సేకరణను యంత్రాంగం పూర్తి చేసింది. రైతులకు పరిహారం అందించేందుకు చర్యలను తీసుకుంటుంది. జిల్లాతో పాటు జగిత్యాల, మంచిర్యాల జిల్లాల పరిధిలో నిర్మాణం కానున్న ఈ నాలుగు లైన్‌ల రోడ్డు పనులను చేపట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ ఏర్పాటు చేస్తుంది. ఇప్పటికే పూర్తిస్థాయి డిపిఆర్‌ను సిద్ధం చేసి కేంద్రానికి పంపించిన అధికారులు అనుమతి రాగానే టెండర్లు పిలిచి పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఒక నేషనల్ హైవే రోడ్ల నిర్మాణాలు జరుగుతుండగా కొత్తగా ఈ నాలుగు లైన్‌ల రోడ్డు నిర్మాణం చేపట్టారు.

ఏటా అనుమతి..

జిల్లాలో ఎన్‌హెచ్-63 రోడ్డు నిర్మాణానికి కేంద్రం ప్రతీ సంవత్సరం అనుమతి ఇస్తుంది. ఈ నాలుగు లైన్‌ల గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. మహారాష్ట్ర- తెలంగాణ - ఛత్తీస్‌ఘడ్‌ల మీదుగా ఒడిస్సాకు వెళ్లే ఈ రోడ్డు నిర్మాణం 900 కిలోమీటర్ల వరకు ఉంది.

- జిల్లాలో నిర్మాణం కానున్న ఎన్‌హెచ్-63 జాతీయ రహదారి
- ఈ నాలుగు లైన్‌ల రోడ్ల నిర్మాణం కోసం భూసేకరణ పూర్తి
- పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు 133 కిలోమీటర్ల మేర నిర్మాణం
- మూడు జిల్లాల పరిధిలో భూములను సేకరించిన అధికారులు
- కేంద్రం నుంచి అనుమతులు రాగానే మొదలు కానున్న నిర్మాణ పనులు



పెర్కిట్ నుంచి నిర్మాణం కానున్న నేషనల్ హైవే ఇదే..

బోధన్ నుంచి కమ్మర్‌పల్లి వరకు

జిల్లాలో బోధన్ నుంచి కమ్మర్‌పల్లి వరకు ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. బోధన్ నుంచి నిజామాబాద్, ఆర్మూర్ వరకు నాలుగు లైన్‌ల రోడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఆర్మూర్‌లోని పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు ఈ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుగా నిర్మాణం అవుతున్న ఈ నాలుగు లైన్‌ల రోడ్డును 133 కిలో మీటర్ల మేరకు నిర్మాణం చేయనున్నారు. బోధన్ నుంచి ఆర్మూర్ వరకు, మంచిర్యాల నుంచి తిరువంచ, జగదల్ పూర్ వరకు ఇప్పటికే నిర్మాణాలు పూర్తయ్యాయి. మధ్యలో ఉన్న మూడు జిల్లాల పరిధిలోని ఈ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు భూసేకరణ కోసం గత సంవత్సరమే నోటిఫి కేషన్ ఇచ్చారు. రైతులతో గ్రామసభలు నిర్వహించారు. ఏఏ ప్రాంతాల్లో భూములు కోల్పోతారో నోటిఫికేషన్ ఇవ్వడంతో పాటు రైతులకు సమాచారాన్ని అందించారు. ఇళ్లతో పాటు వ్యవసాయ సాగు భూమి పోతున్న రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మూడింతలు పరిహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాతో పాటు జగిత్యాల, మంచిర్యాల జిల్లాల పరిధిలో కొన్నిచోట్ల బైపాస్‌లను ఏర్పాటు చేయడం వల్ల ఆయా మండలాల పరిధిలో భూసేకరణను పూర్తి చేశారు. ప్రస్తుతం ఉన్న రోడ్ల వెంట మండల కేంద్రాల నుంచి రోడ్డు వెళితే ఎక్కువ మొత్తంలో ఇండ్ల నిర్మాణాలు పోతుండటంతో బైపాస్ నిర్మాణాలు చేపట్టేందుకు నిర్ణయించారు. భూసేకరణను పూర్తి చేశారు.

పెర్కిట్ నుంచి కమ్మర్‌పల్లి వరకు భూసేకరణ పూర్తి

జిల్లాలో ఆర్మూర్ మండలం పెర్కిట్ నుంచి కమ్మర్‌పల్లి వరకు భూసేకరణ అధికారులు పూర్తి చేశారు. రైతులతో చర్చలు జరిపారు. పరిహారం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏ రైతుది ఎంతెంత భూమి పోతుందో మార్కెట్ రేట్‌లను పరిశీలించడంతో పాటు అక్కడున్న భూముల విలువను బట్టి పరిహారాన్ని ఇచ్చేందుకు నిర్ణయించారు. జిల్లా పరిధిలో మొత్తం 250 ఎకరాల భూమిని ఈ జాతీయ రహదారి నిర్మాణం కోసం సేకరిస్తున్నారు. ఇవేకాకుండా కొన్ని ఇళ్లు కూడా పోతుండటంతో వాటికి కూడా మార్కింగ్ వేశారు. జిల్లాలో వేల్పూర్ మండలం అంక్సాపూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లిలో గ్రీన్‌ఫీల్డ్ బైపాస్‌లను వేస్తున్నారు. మండల కేంద్రం నుంచి వెళ్లడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

పరిహారం అందించేందుకు ఏర్పాట్లు

జిల్లాలో భూసేకరణ పూర్తి చేసిన అధికారులు త్వరలోనే రైతులకు పరిహారం అందించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా నుంచే కాకుండా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, కోరుట్ల, మేడ్‌పల్లి, జగిత్యాల, ధర్మపురిల వద్ద బైపాస్ రోడ్‌ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. మంచిర్యాల జిల్లా పరిధిలో లక్షెట్టిపేటతో పాటు మరికొన్ని గ్రామాల పరిధిలో ఈ బైపాస్ రోడ్ల నిర్మాణం చేయనున్నారు. ఈ జిల్లాల పరిధిలో కూడా భూసేకరణను పూర్తి చేసిన అధికారులు పరిహారం అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నాలుగు లైన్‌ల రోడ్ల నిర్మాణంలో పలు గ్రామాల పరిధిలో వంతెన నిర్మాణాలకు కూడా ఏర్పాట్లను చేస్తున్నారు. కొన్నిచోట్ల భారీ వంతెనలు నిర్మాణం చేపడుతుండగా మరికొన్ని చోట్ల చిన్న వంతెనల నిర్మాణాలు చేపట్టనున్నారు.

కేంద్రానికి డీపీఆర్‌ను పంపిన అధికారులు

ఈ నాలుగు లైన్‌ల రోడ్ల నిర్మాణం కోసం భూసేకరణ పూర్తికావడంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు డీపీఆర్(డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్)ను కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. కేంద్రం నుంచి అనుమతులు రాగానే టెండర్లను పిలిచి రోడ్డు నిర్మాణాలను చేపట్టనున్నారు. రెండు బిట్లుగా చేసి ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు నేషనల్ హైవే అథారిటీ అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది. నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ రోడ్డు నిర్మాణం మొదలు కాగానే రెండేళ్లలోపు పూర్తి చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ సంస్థ అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే మెదక్, బాన్సువాడ మీదుగా రుద్రూర్, బోధన్, భైంసా వరకు ఒక నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం జరుగుతోంది. అదే రీతిలో మద్నూర్ నుంచి కోటగిరి మీదుగా రుద్రూర్ వరకు మరో నాలుగు లైన్‌ల రోడ్డు నిర్మాణానికి అనుమతులను మంజూరు చేశారు. ఈ రెండు రోడ్లతో పాటు ప్రస్తుతం ఎన్‌హెచ్-63 కూడా అనుమతులు ఇవ్వడం వల్ల జిల్లాలో జాతీయ రహదారుల వల్ల రైతులతో పాటు ప్రజలకు కూడా ఉపయోగపడనుంది. వ్యవసాయ ఉత్పత్తులతో పాటు ఇతర ఉత్పత్తులను కూడా ఇతర ప్రాంతాలకు

మిగతా 8వ పేజీలో...



రైతుల ఖాతాల్లో బోనస్!

గురువారం రూ.12.52 కోట్లు జమ

- జిల్లాలో రైతులకు బోనస్ పంపిణీ
- సన్నరకం ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో నగదు జమ

నిజామాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లింపు మొదలైంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రైతుల నుంచి సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. అమ్మిన రైతులకు వారి ఖాతాల్లో బోనస్‌ను జమచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 20రోజుల క్రితం ధాన్యం కొనుగోలు మొదలుపెట్టిన అధికారులు ప్రతిరోజూ పెద్ద ఎత్తున ధాన్యాన్ని కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిత్యం 20వేల మెట్రిక్ టన్నుల వరకు సేకరిస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ట్యాబ్ ఎంట్రీ చేసి రైతుల ఖాతాల్లో డబ్బులను జమచేస్తున్నారు. జిల్లాలో 20రోజుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 670 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొంటున్నారు. మద్దతు ధరకు సన్నరకాలతో పాటు దొడ్డురకాలను వేరు వేరు కేంద్రాలు ఏర్పాటుచేసి సేకరిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు వివరాలను ఏరోజుకారోజు పౌరసరఫరాల సంస్థకు సంబంధించిన ఆన్‌లైన్‌లో జమచేస్తున్నారు. రైతు అమ్మిన ధాన్యానికి అనుగుణంగా మద్దతు ధర ప్రకారం వారి ఖాతాల్లో డబ్బులను జమచేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్నరకాల ధాన్యానికి బోనస్ ఇచ్చేందుకు ఏర్పాటు చేశారు. జిల్లాలో సన్నరకం ధాన్యం అమ్మిన రైతులకు క్వింటాలుకు 500రూపాయల చొప్పున బోనస్‌ను అందిస్తున్నారు. జిల్లాలో గురువారం బోనస్ పంపిణీని చేపట్టారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో గురువారం 3223 మంది రైతులకు వారు అమ్మిన ధాన్యం ప్రకారం 12కోట్ల 52లక్షల 43వేల 4వందల రూపాయలను జమచేశారు. ప్రతిరోజూ కొంతమంది రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేయనున్నారు. ఈ సీజన్‌లో సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన ప్రతి రైతుకు డబ్బులు జమచేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అరవింద రెడ్డి తెలిపారు. ఏ రోజుకారోజు వచ్చిన జాబితా అనుగుణంగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని తెలిపారు.



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించిన డీజీ

ఖిల్లా, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని పోలీసు శాఖ డైరక్టర్ జనరల్ (డీజీ) అనిల్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉందని సిబ్బందిని నియమించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ డీజీ దృష్టికి తెచ్చారు. ఖాళీగా ఉన్న సిబ్బందిని పెంచాలని పోస్టులను భర్తీ చేయాలని కోరారు.



జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

దివ్యాంగులకు క్రీడా పోటీల నిర్వహణ

నిజామాబాద్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం పాత కలెక్టరేట్ మైదానంలో దివ్యాంగ బాల బాలికలకు, దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అదనపు కలెక్టర్ అంకిత్ జెండా ఊపి ప్రారంభించారు. స్నేహా సొసైటీ, ఏపీ ఫోరమ్, గ్రీసి ఆర్గనైజేషన్‌ల ద్వారా నడుపబడుతున్న ప్రత్యేక పాఠశాలలోని మానసిక దివ్యాంగ విద్యార్థిని విద్యార్థులు, అంధ, బధిర విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగులు, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుపబడుతున్న భవిత సెంటర్లు, మెప్మా కార్యాలయం ద్వారా నడుపబడుతున్న సమాఖ్య నుంచి వివిధ రకాల దివ్యాంగులు, ప్రభుత్వ బాలుర వసతి గృహం విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ట్రై సైకిల్ రేస్, రన్నింగ్, చెస్, క్యారమ్, షాట్‌పుట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని రసూల్‌బీ, రాజన్న, స్నేహా సొసైటీ కార్యదర్శి సిద్దయ్య జ్యోతి, రమేష్, శోభ పాల్గొన్నారు.

కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం

బోధన్‌రూరల్,నవంబరు21(ఆంధ్రజ్యోతి): బోధన్‌లోని కమ్మ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఈ నెల 24వ తేదిన ఆదివారం నిర్వహించనున్నట్లు కమ్మ సంఘం అధ్యక్షులు పల్లెంపాటి శివన్నారాయణ, దావులూరి హరినాథ్ బాబు, పల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. గురువారం బోధన్‌లోని కమ్మ సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 8వ వార్షికోత్సవ కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు, డాక్టర్ శ్రీమతి కోడె సుచరిత, ముమ్మాలనేని రాజశేఖర్, మండవ నళిని వెంకటేశ్వర్ రావు, ముమ్మాలనేని అమర్‌నాథ్ బాబు, పూదోట రవి కిరణ్ తదితరులు ముఖ్య అతిథులు హాజరుకానున్నారన్నారు. కార్యక్రమానికి కమ్మ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆదివారం ఉదయం 9గంటల నుండి 11గంటల వరకు ఆటపాట పోటీలతో పాటు కార్తీక వన భోజన కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ పావులూరి వెంకటేశ్వర్ రావు, చెదలవాడ వెంకటేశ్వర్ రావు. ఏ.పాపారావు, తలసాని శ్రీకాంత్, పల్లెంపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ నిర్మించారు.. అప్పగించడం మరిచారు!



ముత్యంపేటలో ఆరోగ్య ఉప కేంద్రం భవనం

దోమకొండ,(బీబీపేట) నవంబరు 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం నూతన భవన నిర్మాణం పూర్తాయి సంవత్సరాలు గడుస్తుంది. కానీ ఇప్పటీ వరకు నూతన భవనాన్ని సంబంధిత వైద్య శాఖకు అప్పగించడం లేదు. ప్రస్తుతం ముత్యంపేటలో ఆరోగ్య ఉప కేంద్రం పశువుల ఆసుపత్రిలోని ఒక గదిలో కొనసాగుతుంది. ప్రభుత్వ నిధులు రూ.20లక్షలు,ముత్యంపేట గ్రామానికి చెందిన మేరుగు రవీందర్‌రెడ్డి రూ.15 లక్షలు దాత సహకారంతో బిల్డింగ్ పూర్తి చేశారు. భవనం నూతన హంగులతో నిర్మితమై ఉన్నప్పటీకి ఆవరణలో చెత్త చేదారంతో నిండిపోయింది. ఈ విషయమై బీబీపేట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ భానుప్రియను వివరణ కోరగా తమ శాఖకు ఆ భవనం అప్పగించలేదని తెలిపారు. ఇప్పటికైన సంబంధిత శాఖ జిల్లా అధికారులు స్పందించి పూర్తయిన ఆరోగ్య ఉప కేంద్రం బిల్డింగ్‌ను బీబీపేట పీహెచ్‌సీకి అప్పగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

బోధన్‌రూరల్,నవంబరు21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ, ఎంవీఐ శ్రీనివాస్‌లు అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచించారు. ద్విచక్ర వాహనాలు నడించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. విద్యార్థులు కొత్త చట్టాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ లలిత పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్,నవంబరు21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో గురువారం పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. అలాగే డంపింగ్‌యార్డులో గల టీఆర్‌సీసీ కంపోస్టు యార్డును పరిశీలించి తడి పొడి చెత్తను వేరుచేసే విధానంపై మున్సిపల్ సిబ్బందికి తెలియజేశారు. ఆయన వెంట సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్, ఎన్విరాల్‌మెంటల్ ఇంజనీర్ పూర్ణమౌళి పాల్గొన్నారు.

సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలి



కోటగిరిలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

కోటగిరి,నవంబరు21(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడ ఎరువులను అందుబాటులో ఉంచాలని కోటగిరి వ్యవసాయ అధికారి రాజు సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఎరువుల విక్రయాలపై సహకార సంఘం, ప్రైవేటు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రాజు మాట్లాడుతూ డీఏపీ, యూరియా ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని రకాల ఎరువులను రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఇవ్వాలని సూచించారు. ఎరువులు, పెస్టిసైడ్ విక్రయాలలో లింకు పద్ధతులను అవలంభించవద్దని సూచించారు. ఎరువుల విక్రయాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గౌస్, డీలర్లు, సహకార సంఘ సీఈవోలు పాల్గొన్నారు.

విజయ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ నరేందర్

మాక్లూర్, నవంబరు21(ఆంధ్రజ్యోతి):విజయ్‌రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్ ఫ్రెషర్స్ పార్టీని విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులు నూతన ప్రవేశించిన విద్యార్థులను స్వాగతం పలికారు. ఇట్టి వేడుకల్లో కళాశాల చైర్మన్ నరేంధర్ రెడ్డి మాట్లాడుతూ నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ కళాశాల విద్యాసంస్థ మాత్రమే కాదు మీకళలను సకారం చేసుకునే వేదిక అన్నారు.విద్యార్థులు కష్టపడి చదివితే తమ లక్ష్యాలను సాధించు కోవాలని, తమవంతు సహయ సహకారాలు కూడా అందిస్తామన్నారు. కోకిల నాగరాజు తన సంగీత ప్రదర్శనతో సభను ఆకట్టుకుకొని ప్రఖ్యాత పాటలతో పలువురిని మంత్ర ముగ్దులను చేశారు. అనంతరం సీనియర్ విద్యార్థుల పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎన్‌వీ.గణేష్‌తో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జుక్కల్ ఎమ్మెల్యేపై టీపీసీసీ చీఫ్‌కు సీనియర్ల ఫిర్యాదు

- గాంధీభవన్ ఎదుట కాంగ్రెస్ సీనియర్ నేతల ధర్నా
- తమను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆగ్రహం

కామారెడ్డి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుపై ఆ నియోజకవర్గంలోని కాంగ్రెస్ సీనియర్ నేతలు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తీరుకు నిరసనగా సీనియర్ కాంగ్రెస్ నేతలు గాంధీభవన్ ఎదుటే ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, కనీసం తమకు విలువ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే గెలుపుకోసం తామంతా చెమటోడ్చి కష్టపడ్డమని, అలాంటిది ఎమ్మెల్యే ప్రస్తుతం తమనే పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను కాదని బీఆర్ఎస్, బీజేపీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని, వారినే వెంటపెట్టుకుని తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకోసం కష్టపడ్డామని నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేశామని వారు చెప్పుకొచ్చారు. కష్టపడిన వారిని గుర్తించకుండా నామినేట్ పదవులు ఇవ్వకుండా ఎమ్మెల్యే అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే తన తీరును మార్చుకోవాలని కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఇచ్చి నామినేట్ పదవులు ఇవ్వాలని పార్టీ అధిష్ఠానాన్ని సీనియర్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గంలోని జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్, పిట్లం మండలాల సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అరవింద్, కమల్,వినోద్, సంఘమేశ్వర్, జయప్రదీప్ పాల్గొన్నారు.



గాంధీభవన్ ఎదుట నిరసన తెలుపుతున్న జుక్కల్ నియోజకవర్గ సీనియర్ నేతలు

ఉమ్మడి జిల్లాల్లో చెకుముకి సైన్స్ సంబరాలు



చెకుముకి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నిజాంసాగర్,నవంబరు 21(ఆంధ్రజ్యోతి):నిజాంసాగర్, మహ్మద్ నగర్ మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ పాఠశాలలలో సమగ్ర శిక్ష తెలంగాణ ప్రభుత్వం సహకారంతో మండల స్థాయి చెకుముకి పరీక్షలను నిర్వహించారు. మండల స్థాయిలోని అన్ని పాఠశాలల 8, 9, 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు సైన్స్ టెస్ట్ నిర్వ హించాలని కోరారు. దీనికి గాను పాఠశాల స్థాయిలో 8, 9, 10వ తర గతి విద్యార్థులను ఎంపిక చేశారు. తెలుగు మీడియం స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లూరు విద్యార్థులు ప్రథమస్థానం, ఇంగ్లీష్ మీడియంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిజాంసాగర్ విద్యార్థులు ప్రథ మ స్థానంలో, కేజీబీవీ, నవోదయ, మోడల్ స్కూల్, కేవీఎస్ పాటశాల తరపున కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో గెలుపొం దారు. ఈ మూడు పాఠశాలల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపి కయ్యారు. ఎంపికైన విద్యార్థులకు నిజాంసాగర్ మండల విద్యాశాఖ అధికారి తిరుపతిరెడ్డి, మహ్మద్‌నగర్ మండల విద్యాధికారి అమర్‌సింగ్, ఉపాధ్యాయులు విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

ఆలూర్ పాఠశాలలో చెకుముకీ టాలెంట్ టెస్ట్



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో గురువారం చెకుముఖి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండల పరిధిలోని గుత్ప, ఆలూర్, దేగాం, కల్లెడి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కల్లెడ పాఠశాల విద్యార్థులు గోపిచంద్, అఖిల, సంజన అత్యధిక మార్కులు సాధించి జిల్లా స్థాయి చెకుముఖి పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి ఎం.నరేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇలాంటి టాలెంట్ టెస్టు నిర్వహణ వల్ల ప్రజల్లో, విద్యార్థుల్లో ఉన్న మూఢవిశ్వాసాలు తొలిగిపోయి శాస్త్రీయ దృక్పథం పెం పొందించడానికి పని చేస్తుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అంద జేశారు. ఈకార్యక్రమంలో శ్రీకాంత్, పిట్ల గణేష్, అశ్వక్ హైమద్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల జిల్లా పరిషత్ హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించినట్లు ఎల్లారెడ్డి ఎంఈవో వెంకటేశం తెలిపారు. ఈ పోటీలలో మత్తమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో, ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు తెలుగులో మండల స్థాయి టాలెంట్ టెస్టులో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు కోనాసమందర్ విద్యార్థి

కమ్మర్‌పల్లి, నవంబరు 21:(ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండలం కోనాసమందర్ ఉన్నత పాఠశాలకు చెందిన విస్లావత్ సంధ్యఅనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్‌ఎం మధుపాల్, పీడీ రమేష్‌గౌడ్ తెలిపారు. ఇటీవల తిర్మన్‌పల్లిలో నిర్వహి ంచిన టోర్నమెంట్‌లో అండర్ 14బాలికల విభాగంలో అత్యంత క్రీడ ప్రతిభ కనబర్చినందుకుగాను విద్యార్థిని సంధ్యను రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కాగా ఈ నెల 23, 24, 25 తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లా కేసముద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుతరఫున అడుతుందని తెలిపారు.కార్యక్రమంలో వీడీసీ సభ్యులు పోతనక రాజ గంగారాం, అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యురా లు నస్రిన్ బేగం,పాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘటితమై హక్కుల సాధనకు కృషి చేస్తా

ముప్కాల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పట్ల అందరిని కలుపుకొని సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని టీఎన్‌జీవో నూతన జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ న్నారు. ఎస్సారెస్పీ టీఎన్‌జీవో యూనిట్ ఆధ్వర్యంలో ముప్కాల్ ముప్కాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. యూనిట్ ఉద్యోగుల సమస్యలపై చర్చించి టీఎన్‌జీవో జిల్లా కార్యాలయంలో గ్రీన్ వెల్ఫ్‌సెల్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. గ్రీన్ వెల్ఫ్ సెల్‌లో ఏలాంటి సమస్య అయిన మూడు రోజుల్లో విడతల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం అనంతరం టీఎన్‌జీవో నూతన జిల్లా అధ్యక్షునిగా ఎన్. సుమన్, జిల్లా కార్యదర్శిగా నేతికుంట శేఖర్‌లను ఎన్నుకొని పూలమాల, శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు జాకీర్‌హెస్సెన్, జాఫర్‌హుస్సెన్, ఉమా కిరణ్, మాణిక్యం, నీరంజన్‌గౌడ్, సుభాకర్, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నవీపేట,నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాలకు చెందిన అండర్-17 బాల, బాలికల క్రీడాకారులకు రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల ఎంపిక నిర్వహించారు. అండర్-17 బాల, బాలికలకు ఈ ఎంపిక పోటీలు నిర్వహించగా ఇందులో ఉమ్మడి జిల్లాలకు చెందిన 38మంది బాలికలు, 28మంది బాలురు పోటీలలో పాల్గొన్నారు. ఇందులో నుండి ఐదుగురు బాలికలు, 8మంది బాలురను ఈ నెల 23 నుండి 25వ తేది వరకు సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో జరిగే రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనడానికి ఎంపిక చేయడం జరిగిందని పీడీ రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి, జేడీద్య, భూమయ్య తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఆర్మూర్ గంగారెడ్డిని పరామర్శిస్తున్న ఐడీసీఎంఎస్ చైర్మన్

జక్రాన్‌పల్లి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో గురువారం ఆలూర్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డిని ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదవత్ తారాచంద్‌నాయక్ పరామర్శించారు. ఆర్మూర్ గంగారెడ్డి తండ్రి చనిపోవడంతో గంగారెడ్డిని ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదవత్ తారాచంద్ నాయక్ పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, మాజీసర్పంచ్ కాట్‌పల్లి నర్సారెడ్డి, మాజీ వైస్ఎంపీపీ జితేందర్‌నాయక్, మాజీఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జైడి మల్లేష్, సురేష్, మంగ్యానాయక్, తదితరులు ఉన్నారు.

మైనారిటీ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

బోధన్‌రూరల్,నవంబరు21(ఆంధ్రజ్యోతి): మైనారిటీ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని బోధన్ ఉర్దూఘర్ చైర్మన్ బ్యాటరీ బాబా అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు జిలానీ వెల్ఫేర్ సోసైటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, గైడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మైనారిటీ విద్యార్థులు 10వ తరగతిలో ప్రతి ఒక్కరు ఉత్తీర్ణులు అయ్యేలా పట్టుదలతో చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సనా పటేల్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

జక్రాన్‌పల్లి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఐదు డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ జక్రాన్‌పల్లిలో ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కిరణ్మాయికి వినతిపత్రం అందజేశారు. విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్ల ప్రజలకు ప్రభుత్వం అందించాలని ధర్మసమాజ్ పార్టీ మం డల అధ్యక్షుడు మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, డీఎఫ్‌సీ, ఆర్ఎంల అభ్యున్నతికి ధర్మసమాజ్ పార్టీ ప్రభుత్వంతో పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ధర్మసమాజ్ పార్టీ కోశాధికారి దిలిప్, మండల నాయకులు చిన్న భూమన్న, గంగాధర్, మీడియా ఇన్‌చార్జీ రవి, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు

ఏర్గట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ హయాంలో ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కడ్తా తీయలేదని కాంగ్రెస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం మండలంలోని తాళ్ల రాంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్య క్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించాడానికి వచ్చిన విత్తనాభివృద్ధి చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి గత ప్రభు త్వంలో 6 కిలోల కడ్తా తీసారని మాట్లాడటం సరికాదని దీన్ని బిఆర్ఎస్ పార్టీ తరఫున ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బోనగిరి రమేష్, అశోక్ యాదవ్, దేవన్న, గంగాధర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు గ్రామాభివృద్ధి కమిటీ విరాళం

బోధన్‌రూరల్,నవంబరు21(ఆంధ్రజ్యోతి): సాలూర మండలం తగ్గెల్లి ప్రభుత్వ పాఠశాలకు గ్రామాభివృద్ధి కమిటీ పాఠశాల అభివృద్ధికి విరాళం అందజేశారు. పాఠశాల అభివృద్ధి ఉపాధ్యాయుల పాత్రతో పాటు గ్రామాభివృద్ధి కమిటీలు సరైన బాధ్యతలు తీసుకున్నప్పుడే పాఠశాల అభివృద్ధిలోకి వస్తుందని, విద్యార్థులు ఉత్తీర్ణులు అవుతారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధన్‌రాజ్ అన్నారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి గ్రామస్థులు గ్రామ కమిటీ ద్వారా 13వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్, జగదాంబ మాత విగ్రహ ప్రతిష్ఠాపన



దుబ్బ తండాలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మోస్రా, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చే నెంబర్ దుబ్బతండాలో సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాత ఆలయం నిర్మాణం పూర్తి అయిన సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను గ్రామస్థులు మంగళ హారతులతో పురోహితుల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేసి ఆలయానికి చేరుకుని శాంతి హోమం చేసి విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠాపన చేశారు. మూడు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు ఏనుగు రవీందర్ రెడ్డి పాల్గొని గిరిజనుల ఆరాధ్య దైవం జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన ఉపాధ్యక్షుడు, నాయకులు యలమంచిలి శ్రీనివాస్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు ఏఎంసీ వైస్ చైర్మన్ కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు, గ్రామ పెద్దలు, యువతీ, యువకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



కమ్మర్‌పల్లి ధ్వంసంమైన డివైడర్

కమ్మర్‌పల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన డివైడర్‌ను గురువారం సాయంతరం జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా ధ్వంసం అయిందన్నారు. కమరీనగర్ వైపు నుంచి వచ్చే బస్సులు అదే పక్క నుంచి ఆర్టీసి బస్టాండ్ లోని వెళ్లి మోర్తాడ్ వైపు ఉన్న ఔట్ గేటు నుంచి బయటకు వెళ్లాలి కాగా మెట్‌పల్లి వైపు నుంచి వచ్చిన ఈ బస్సు రూట్ తెలియక ముందుగు వచ్చేశాడు. కండక్టర్ చెప్పడంతో అక్కడి నుండే లోనికి వెళ్లే ప్రయత్నంలో డివైడర్‌కు బస్సు డీజిల్ ట్యాంక్ తగిలి ధ్వంసంఅయింది. ఈ విషయమై స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ రిపించారు. అయితే ధ్వమైన డివైడర్ తను తిరిగి నిర్మిపజేస్తానని హమీ ఇవ్వ దంతో పోలీసులు వెళ్లి పోయారు. అధికారులు యుద్ధప్రాతిపాదికన ధ్వంసమైన డివైడర్‌కు మరమ్మత్తు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



పచ్చలనడ్కుడలో సమగ్ర సర్వే తీరును పరిశీలిస్తున్న అన్వేష్‌రెడ్డి

వేల్పూర్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును ఆయన పరిశీంలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు వచ్చే ఎన్యుమారేటర్‌లకు కుటుంబసభ్యులకు సంబంధించిన వివరాలు అందించాలన్నారు. ఎన్యుమారేటర్‌లు ఎలాంటి తప్పులు లేకుండా సర్వే ఫాంలో కుటుంబ వివరాలు నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కరి గంగాధర్,నర్సారెడ్డి, నాయకులు ఇతర నాయకులు ఉన్నారు.

సమగ్ర సర్వే నమోదు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో సర్వే నమోదు ప్రారంభించినట్లు కమిషనర్ రాజు తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే నమోదును పూర్తయిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను గురువారం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

మండలాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సుంకెట్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకెట్, దొన్కల్, ఒడ్యాట్ గ్రామాల్లో బాధిత కుటుంబాలకు గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. దొన్కల్‌లో బట్టు శైలేందర్‌కు రూ.60వేలు, సుంకెట్‌లో బోగ శ్రీకాంత్‌కు రూ.32వేలు, ఒడ్యాట్‌లో నిత్యకు రూ.20వేల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులకు పంపిణీ చేయించిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సుంకెట్‌లో ఆకుల రాజేశ్వర్, తీగెల సంతోష్, సుధీర్, దొన్కల్‌లో రాజ్‌కుమార్, మల్లికార్జున్, కల్లెం రవి, మహేందర్, రాజ్‌పాల్, వినోద్ కిరణ్, ఒడ్యాట్‌లో నవీన్, పెండెంశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గురువారం బాధిత కటుంబ సభ్యులకు ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ప్రొద్దుటూరి వినయ్ రెడ్డి ముఖ్యమంత్రి సహయ నిధి చెక్కును అందజేశారు. గత కొన్ని రోజుల క్రితం నందిపేట మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన బైండ్ల గంగాధర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయన ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ పథకం కింద రూ.60వేల చెక్కును బాధిత కుమారుడు, ఆర్మూర్ నియోజక వర్గం యువజన కాంగ్రెస్ నాయకులు బైండ్ల ప్రశాంత్‌కు పి. వినయ్ రెడ్డి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కమ్మర్‌పల్లి: మండలంలో చౌట్‌పల్లి , హసాకొత్తూర్ నర్సపూర్ గ్రామాలకు చెందిన బాధిత కుటంబాలవారికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య కిషాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీన్ బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో బుచ్చిమల్లయ్య, పాలెపు గంగారాం, రేవతి గంగాధర్, కొమ్ముల రవిందర్, కొమ్ముల రాజేందర్, అల్లకొండ రాజేష్, వీడీసీ సభ్యులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు కేజీబీవి విద్యార్థి



ముప్కాల్‌లో విద్యార్థి మహేశ్వరిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముప్కాల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో నిర్వహించగా ముప్కాల్ కేజీబీవీ పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 9వ తరగతి విద్యార్థిని మహేశ్వరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు స్పెషల్ ఆఫీసర్ వినోద తెలిపారు. ఈ సందర్భంగా స్టేట్ కబడ్డీ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ గంగాధర్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థిని మహేశ్వరిని అభినందిం చారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయురాలు ప్రమీల, ఉపాధ్యాయురాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలి



బాల్కొండ మోడల్‌స్కూల్‌లో ..

ముప్కాల్,నవంబరు21(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి న మెను ప్రకారం విద్యార్థులకు నా ణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అం దించాలని మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ ఆదేశించారు. గురు వారం బాల్కొండ మండల కేంద్రం లోని మోడల్ స్కూల్‌లో విద్యార్థు లకు అం దించే మధ్యాహ్న భోజ నాన్ని పరిశీలించారు. మోడల్‌స్కూ ల్‌లో లర్నింగ్ ఇన్‌స్ట్రుమెంట్, ఉపా ధ్యాయుల బోధన తీరును పరిశీలించి ఆన్‌లైన్ నమో దు చేసినట్లు తెలిపారు. పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయం త్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయునికి సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియను సక్రమంగా చేపట్టాలి

కోటగిరి,నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మండలంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే పత్రాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ గంగాధర్ సూచించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో చందర్ తదితరులున్నారు.

నడి ఊర్ల హనుమాన్ ఆలయ హుండి లెక్కింపు

బోధన్‌రూరల్,నవంబరు21(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని నడి ఊర్ల హనుమాన్ ఆలయంలో గురువారం హుండి లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో హుండిని లెక్కించగా 7,115 రూపాయల ఆదాయం వచ్చినట్లు పట్టణ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్ పట్వారీ తెలిపారు.

పోలీసు సంబురం



సమాజ శ్రేయస్సు కోసం
సంకల్పంతో పనిచేయాలి

- రాష్ట్ర ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్


పరేడ్ చేస్తూ..

ఎడపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసులు సమాజ శ్రేయస్సు కోసం ఓ సంకల్పంతో పని చేయాలని రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్ డి. అనిల్ కుమార్ అన్నారు. ఎడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జానకంపేట గ్రామ శివారులో గల కమిషనరేట్ ట్రైనింగ్ సెంటర్‌లో సైబరాబాద్ నుంచి ఏ.ఆర్. కానిస్టేబుళ్లుగా ఎంపికైన 250మంది స్టయిపండరీ క్యాడెట్ ట్రెయినీ కానిస్టేబుళ్ల 9నెలల పాటు శిక్షణ పొంది పాసింగ్ అవుట్ (దీక్షాంత్ పరేడ్) అవుతున్న సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పోలీసులు సమాజ శ్రేయస్సు కోసం దృఢ సంకల్పంతో పని చేయాలని సూచించారు. జానకంపేట సీటీసీలో 250 మంది శిక్షణ పొందారని, రాష్ట్రంలో మొత్తం 16 శిక్షణ కేంద్రాల్లో 8,149 మంది శిక్షణ పొంది పాసవుట్ అయ్యారని వెల్లడించారు. జాతీయస్థాయిలో తెలంగాణ పోలీసులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఎక్కడ పనిచేసినా జాతీయ సమగ్రతను పాటించాలని, పోలీసుగా ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థకు కృషి చేయాలన్నారు. పోలీసులుగా రావడానికి సహకరించిన ట్రెయినీ కానిస్టేబుళ్ల తల్లిదండ్రులను సైతం అనిల్ కుమార్ అభినందించారు. డబ్బు సంపాదన వైపు చూడకుండా జీవితాలను ఆదర్శ ప్రాయంగా ఉంచుకోవాలని సూచించారు. దీక్షాంత్ పరేడ్‌లో ప్రదర్శన చాలా బాగుందని, శిక్షణ ఇచ్చిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధూశర్మ, సీటీసీ ప్రిన్సిపాల్ కోటేశ్వర్‌రావు, వైస్‌ప్రిన్సిపాల్ మస్తాన్ అలీ, అదనపు డీ.సీ.పీ.లు, 7వ బెటాలియన్ అడిషనల్ కమాండెంటు, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, స్పెషల్ బ్రాంచ్, సీసీఎస్ ట్రాఫిక్, సీసీఆర్‌బీ, ఏసీపీలు సీఐలు, ఎస్సైలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వు ఇన్స్పెక్టర్, శిక్షణ పొందిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు ఉన్నారు.


దీక్షాంత్ పరేడ్‌ను తిలకిస్తున్న పోలీసు అధికారులు


టోపీని తల్లికి తొడుగుతున్న కుమారుడు


తల్లితో ఇద్దరు కానిస్టేబుళ్లు


ప్రదర్శనను ఇస్తున్న కానిస్టేబుళ్లు


తల్లికి సెల్యూట్ కొడుతున్న కుమారుడు


తండ్రికి పాదాభివందం చేస్తూ..

ఆలోచన ఆచరణ


ఇంటి ముందు ఇలా పచ్చని మొక్కల కుండీలు

మిద్దె తోట.. ఆరోగ్య పంట

- సేంద్రియ విధానంలో పెంపకంపై నగరవాసుల ఆసక్తి
- ఇంటికి సరిపడా కూరగాయలు మిద్దె తోటలోనే లభ్యం
- పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ ఉత్సాహంగా పెంపకం

బోధన్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ప్రస్తుతం రూ.500 పెట్టినా వారానికి సరిపడా కూరగాయలు వచ్చే పరిస్థితి లేదు. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు తోడు కూరగాయల ఉత్పత్తి తగ్గుతుండడం ఇతరప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుండడంతో ధరల పెరుగుదలకు కారణమవుతోంది. గ్రామీణ ప్రాంతాలలో సైతం రైతులు కూరగాయల సాగుపై దృష్టిపెట్టడం తగ్గింది. కొన్నిచోట్ల కూరగాయలను పండిస్తున్న విపరీతంగా క్రిమి సంహారక మందులను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది నగర, పట్టణ ప్రజలు సేంద్రియ పద్ధతిలో సాగయ్యే పంట ఉత్పత్తులపై ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువులు వాడకుండా వంటింటి వ్యర్థాలన పోగుచేసి సేంద్రియ ఎరువులుగా మార్చి కూరగాయల మొక్కలను పెంచుతున్నారు. పలు రకాల కషాయాలను తయారు చేస్తూ వినియోగిస్తున్నారు. పెరటి, మిద్దె తోటల్లో పనితో వ్యాయమంగా ఉండడంతో పాటు పచ్చని మొక్కల మధ్య గడపడంతో ఉత్సాహంగా ఉంటోందని పచ్చని స్వచ్ఛమైన గాలికూడా తమకు అందుతోందని నగరంలో మిద్దె తోటలు సాగు చేస్తున్న వారు పేర్కొంటున్నారు.

పెరుగుతున్న మిద్దె తోటల సాగు

గతంలో వేళ్ల మీద లెక్క పెట్టే విధంగా ఇళ్లపైన కూరగాయలు, పూల మొక్కలు సాగుచేసే వారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో మేడపైన వీటిని పెంచుతున్న సంఖ్య ఇప్పుడు వేలల్లోకి చేరింది. జిల్లాలోని బోధన్ పట్టణంతో పాటు ఇతర పట్టణాల్లో మిద్దెతోట సాగుపై పట్టణ ప్రజలు దృష్టి పెట్టారు. మిద్దె తోటల సాగుతో పట్టణ ప్రజలు కూరగాయలు, పూల మొక్కలు, పండ్ల మొక్కలను పెంచుతున్నారు. తాజా కూరగాయలను వినియోగించడంతో పాటు ప్రకృతి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

ఎవరైనా పండించవచ్చు

మిద్దె తోట సాగులో కూరగాయలను ఎవరైనా పండించే అవకాశం ఉంటుంది. టమాట, వంకాయ, బీర కాయ, దొండకాయ, సొరకాయ, గోరు చిక్కుడు లాంటి కూరగాయలు, పాలకూర, చుక్కకూర, గోంగూర, పుదీన, కరివేపాకు, కొత్తిమీర లాంటి ఆకు కూరలు ఇంటి ఆవరణలో, మేడలపైన సులభంగా సాగు చేసుకోవచ్చు. వీటిని పెంచడం ఏమంత కష్టం కాదు. ఒక్కసారి మంచి మట్టిని, సేంద్రియ ఎరువులను వాడి విత్తనాలు వేసి అవసరాన్ని బట్టి నీళ్ల అందిస్తే 20 నుండి 30 రోజుల వ్యవధిలోనే తాజా కూరగాయలు అందుబాటులోకి వస్తాయి. కొన్ని కొన్ని కుండీల్లో తక్కువ చోటులో పెరిగే మొక్కలు లభ్యమవుతున్నాయి.

ప్రకృతిపై ప్రేమతో మిద్దె తోట ఏర్పాటు

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తా ప్రాంతానికి చెందిన సయ్యద్ యూసుఫ్ అలీ ప్రకృతిపై ప్రేమతో తనఇంటిపైన మిద్దె తోటను ఏర్పాటు చేశారు. ట్రాన్స్ కో శాఖలో పని చేసి రిటైర్డ్ అయిన తర్వాత మిద్దె తోటను ప్రారంభించారు. మిద్దెతోటలో కూరగాయలు, పండ్లు, పూలు పండిస్తున్నారు. తమ అవసరాలకు కావాల్సిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, పూలను పొందుతున్నారు. మిగిలిన వాటిని బంధువులకు, స్నేహితులకు ఇస్తూ మెప్పు పొందుతున్నారు. దూరం నుంచి సయ్యద్ యూసుఫ్ ఇంటి పైభాగం పచ్చని మొక్కలతో దర్శనమిస్తోంది.


ఇంటి చుట్టూ పచ్చదనం


మిద్దెతోటను చూపిస్తున్న సయ్యద్ యూసుఫ్


మిద్దెతోటలో అరటి చెట్టు


టోర్నమెంట్‌లో సత్తాచాటిన విద్యార్థులు

జిల్లాస్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్‌లో
సుద్దులం విద్యార్థుల ప్రతిభ

డిచ్‌పల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిర్మన్‌పల్లి హైస్కూల్‌లో ఇటీవల జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ బాలబాలికల నెట్‌బాల్ టోర్నమెంట్‌లో సుద్దులం పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చారు. బాలురు ప్రథమ స్థానం, బాలికలు ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా గ్రామ వీడీసీ సభ్యులు చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్, గంగాధర్, స్కూల్ చైర్మన్ రాజగంగు, వీడీసీ పెద్దలు, ప్రధానోపాధ్యాయులు గంగారాంలు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీడీసీ సభ్యులు విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం కొరకు రూ.10500ను ప్రదానం చేశారు.

అనుమతులు 70..
ట్రిప్పులు 120!



- వే బిల్లు పేరిట భీమ్‌గల్‌లో డంపులు
- ప్రశ్నిస్తే బెదిరింపులు

భీమ్‌గల్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): అధికారుల కళ్లు కప్పి అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. దీనిపై అధికారుల నిఘా కరువవడడంతో ఇసుకాసురుల దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పట్టణ కేంద్రంలోని కప్పలవాగు వద్ద ఏర్పాటు చేసిన ఇసుక పాయింట్ నుంచి వందల ట్రిప్పులు అక్రమంగా తీసుకువెళ్తున్నారు. నూతన నిర్మాణాలు చేపట్టే గృహ యాజమానులు ఇసుక కోసం ప్రయత్నం పేరున డీడీలు కట్టి అట్టి డీడీలతో రెవెన్యూ శాఖ ద్వారానే వేబిల్లు పొందాల్సి ఉంటుంది. ఇసుక వ్యాపారులు నూతన గృహాలు నిర్మించే వారి వద్ద ముందే మాట్లాడుకుని వారు కట్టిన డీడీల ద్వారా రెవెన్యూ శాఖ ద్వారా వే బిల్లులు తీసుకొని అంతకు మించి ఇసుక ట్రిప్పులను తీసుకువెళ్తున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదు. ఈ తతంగాన్ని స్థానికులు ప్రశ్నిస్తే ఇసుక వ్యాపారులు పరుష పదాజలంతో బెదిరింపులకు పాల్పడుతున్నారు.

అనుమతులు 70..
తరలించే ట్రిప్పులు 120

ప్రతీ వారం ఇసుక కోసం రెవెన్యూ శాఖకు వచ్చే డీడీలు కొన్ని అయితే వాగు నుంచి తరలిస్తున్న ట్రిప్పులు అంతకు మించి ఉంటున్నాయి. మంగళవారం కప్పలవాగు నుంచి కొనసాగిన ఇసుక పాయింట్ వద్ద రెవెన్యూ శాఖకు 70 డీడీలు అందగా సాయంత్రం వకు 120ట్రిప్పులు తరలించినట్టు బుధవారం బయటపడింది. దీంతో పట్టణ కేంద్రంలో ఒక ఇంటి వద్ద 34 ట్రిప్పులు, మరో చోట 30ట్రిప్పులు, మధ్యాహ్నం వరకు పోసేశారు. అనంతరం సాయంత్రం వరకు యథేచ్ఛగా ఇసుక తరలింపు కొనసాగింది. ఇదంతా కొందరు వ్యాపారులు డంప్ ఏర్పాటు చేసుకొని అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

అనుమతుల్లో ఒకరి పేరున..
డీడీలు మరొకరి పేరున..

నూతన గృహాలు నిర్మించుకునే వారు ఇసుక కోసం తమ పేరు మీద డీడీ తీసి అట్టి డీడీని రెవెన్యూ శాఖకు సమర్పిస్తే వారు అందించే వే బిల్లు ద్వారా ఇసుక పొందాల్సి ఉంటుంది. కానీ ఇసుక వ్యాపారులు నూతన గృహాలు నిర్మించే వారితో మాట్లాడుకొని వారే తమ పేరు మీద డీడీలు కట్టి రెట్టింపు ఇసుకను తీసుకువెళ్త అధిక ధరకు విక్రయిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఆరా..

పట్టణ కేంద్రంలో ఇసుక అక్రమ రవాణా సాగుతుందని అందిన ఫిర్యాదు మేరకు బుధవారం ఆర్‌ఐ సాయిగౌడ్ పట్టణ కేంద్రంలో ఇసుక డంపులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నూతన గృహ నిర్మాణాల వద్ద ఉన్న ఇసుక డంపులను గురించి యాజమానుల వద్ద అనుమతి పత్రాలను, వే బిల్లులను పరిశీలించారు. దీంతో మంగళ వారం కొనసాగిన పాయింట్ నుంచి రెండు ఇళ్ల వద్ద 64 ట్రిప్పుల ఇసుక పోసినట్టు ఆర్‌ఐ తెలిపారు. భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో కప్పల వాగు నుంచి కొనసాగిన ఇసుక పాయింట్ వద్ద కొత్తవి 70 కాగా, పాతవి 40పైన కలిపి అనుమ తులు ఇచ్చాం. ఇదీ కాకుండా అనుమతులు లేకుండా ఇసుక తీసుకువెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఇసుక అక్రమ రవాణా ఫిర్యాదుతో డంపులను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాకు మరో నేషనల్ హైవే

(ఐదో పేజీ తరువాయి)

సులువుగా సరఫరా చేసే అవకాశం ఏర్పడనుంది. నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో నిర్మాణం కానున్న ఈ నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం జిల్లాలో భూసేకరణను పూర్తి చేశామని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ తెలిపారు. జిల్లాలో ఆర్మూర్, వేల్పూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల పరిధిలో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలోనే భూసేకరణ చేపట్టామన్నారు. రైతులతో చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. భూములు కోల్పోయే రైతులకు కూడా సమాచారం ఇచ్చామని త్వరలోనే వారికి పరిహారాన్ని కూడా అందించనున్నామని ఆయన తెలిపారు.

23న జాబ్‌మేళా

నిజామాబాద్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 23న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మెడిప్లస్, వరుణ్ మోటార్స్ కంపెనీలు ఈ జాబ్‌మేళాను నిర్వహించనున్నారని ఎగ్జిక్యూటీవ్, రిలేషన్‌షిప్ మేనేజర్, సూపర్‌వైజర్, అడ్వైజర్, జూనియర్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్, ఆడిట్ అసిస్టెంట్, సిఎస్‌ఏ ఉద్యోగాలకు ఇంటర్మీడియెట్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ పాసైన పురుష, మహిళ అభ్యర్థులు అర్హులని ఆయన తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డిలలో ఎంపికైన వారు పనిచేయాల్సి ఉంటుందని ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయం శివాజీనగర్‌లో ఈనెల 23న ఉదయం 10.30ల నుంచి మధ్యాహ్నం లోగా ఆధార్‌కార్డు, రెజ్యూమ్, బయోడేటా, ఎస్సెస్సీ, ఇతర స్టడీ సర్టిఫికెట్లు ఫోటోలతో హాజరుకావాలని ఇతర వివరాలకు 9581768413, 9948748428 నెంబర్లను సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా నిర్వహించే గ్రూప్-2 పరీక్ష కొరకు 2 ఉచిత ఫుల్ లెంగ్త్ మాక్ టెస్టులలో పాల్గొనేందుకు అర్హులైన మైనార్టీ యువత (ముస్లీం, క్రిస్టియన్, సిక్, జైన్, బౌద్ధ, పార్శిలు) దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 29 చివరి తేదీ అని జిల్లా ఇంచార్జి మైనార్టీ అధికారి నాగోరావు ఒక ప్రకటనలో తెలిపారు. మాక్ టెస్టులు డిసెంబర్ 2, 3, 9, 10 తేదీలలో ఉదయం 10.30ల నుంచి సాయంత్రం 4.30ల వరకు నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని జిల్లాలోని మైనార్టీ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా కలెక్టరేట్‌లోని రెండవ అంతస్తులో గల జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయం రూం నెంబర్ 221లో సంప్రదించాలని లేదా 9700351786 కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు.

‘చలో పార్లమెంట్’ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28న విద్యా ఉపాధి, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ చేపట్టే ఛలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి అనిల్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద ఏఐపిఎస్‌యు ఆధ్వర్యంలో రూపొందించిన ఛలో పార్లమెంట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలంటే కొటారి కమీషన్ ప్రకారం మొత్తం బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం కేటాయించాలని కానీ ప్రతీసారి 2 నుంచి 3 శాతం కంటే ఎక్కువ కేటాయించడం లేదన్నారు. కార్పొరేట్ వ్యక్తులకు విద్యారంగాన్ని దారాదత్తం చేసేందుకు కేంద్రం నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చిందని ఎవరి అభిప్రాయాలను తీసుకోకుండా దీన్ని అమలు చేయడం సరికాదన్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని అన్నారు. విద్యార్థి, యువజన, మహిళ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ఛలో పార్లమెంట్‌ను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్, గోపాల్, అర్వింద్, నరేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

టీయూలో సీట్లను భర్తీ చేయాలి

డిచ్‌పల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వ విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రిన్స్ రవీందర్, రాకేష్, బాలాజీ, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

డిచ్‌పల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మిట్టపల్లి తండా మాజీ సర్పంచ్ తండ్రి బాదావత్ హాజీరామ్ మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను గురువారం మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. కుటుంబానికి ధైర్యం చెప్పి మృతికి గల వివరాలను అడికి తెలుసుకొని ఓదార్చారు. ఆయన వెంట బాజిరెడ్డి జగన్, శక్కరి కొండ కృష్ణ, ఒడ్డెం నర్సయ్య, నల్లవెల్లి సాయిలు, నడిపన్న, సుంధర్, మధుకర్, రవి, నారాయాణ, శంకర్, తాండా నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ వివరాలను ఎంట్రీ చేయాలి

డిచ్‌పల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా డాటా ఎంట్రీ ఆపరేటర్‌లు సర్వే చేసిన ప్రతీ ఫారంను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ యోహాన్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ డాటాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు నమోదు చేయాలని, సర్వే ఆధారంగా ప్రభుత్వ పథకాలు, విద్య ఉపాధి, అవకాశాలు లభిస్తాయని సూచించారు. ఈ సర్వేలో ఎలాంటి సమస్యలు రాకుండా క్షుణ్ణంగా నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఎంఆర్ఐ సంతోశ్, పాల్గొన్నారు.

ఆక్రమణకు గురవుతున్న టీయూ భూములు

- ప్రహరీ లేక కబ్జాకు పాల్పడుతున్న అక్రమార్కులు

డిచ్‌పల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. వర్సిటీలో నూతనంగా నిర్మిస్తున్న సైన్స్ భవనం వెనక భూమి ఆక్రమణకు గురవుతున్నా.. వర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సైన్స్ భవనం వెనక వర్సిటీ భూములకు ప్రహరీ నిర్మాణం చేయకపోవడంతో చుట్టు పక్కల వ్యవసాయ భూముల వారు వర్సిటీ పరిధి భూముల్లో చొచ్చుకొని వస్తున్నారని, వెంటనే కబ్జాకు గురవుతున్న వర్సిటీ భూములను కాపాడి ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఈ విషయంలో ఇప్పటికే విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



టీయూ సైన్స్ భవనం వెనక ఆక్రమణకు గురవుతున్న స్థలం ఇదే..

ఎమ్మెల్యేను కలిసిన ఖానాపూర్ గ్రామస్థులు



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

మోపాల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని గురువారం క్యాంప్ కార్యాలయంలో రూరల్ మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన గ్రామస్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. త్వరలోనే సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కొర్వ రాజేంద్రప్రసాద్, సీహెచ్ నర్సారెడ్డి, మోహన్, శ్రీనివాస్, మోహన్, పెద్దబబ్లు, తదితరులు ఉన్నారు.

కారోబార్లకు వేతనాలు చెల్లించాలి

మోపాల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న కారోబార్లకు ఆరు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గురువారం మోపాల్ ఎంపీడీవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యాలయం ఎదుట కారోబార్లు నిరసన కూడా వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో గ్రామాల్లో పనిచేస్తున్నామని ఇచ్చే వేతనాలు కూడా సరైన సమయంలో ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎంపీడీవోకు వివరించారు. తమ జీతభత్యాలు త్వరగా ఇవ్వకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

మోపాల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేదలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీల యొక్క శ్రమతో వారు కట్టే పన్నులతో ఈ ప్రభుత్వాలు నడుస్తున్నాయని ధర్మసమాజ్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం వీరు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆర్ఐకి వినతిపత్రం సమర్పించారు. వీరి సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికి విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇండ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు, నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి ప్రశాంత్, మండల నాయకులు మహేష్, గంగాధర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వెంటనే జీవో 55ను పునరుద్ధరించాలి

డిచ్‌పల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం జీవో 29ను రద్దు చేస్తూ జీవో 55ను పునరుద్ధరణ చేయాలని ప్ల కార్డులతో టీయూ సెంట్రల్ లైబ్రరీ వద్ద పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు కర్క గణేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం ఆందోళన చేశారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన గడుగు గంగాధర్



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో గడుగు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును గురువారం జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయ, సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఇతర సభ్యులు, ఛైర్మన్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు ఇందిరాగాంధీ మెమొంటోతో ఘనంగా సన్మానించారు. గడుగుతో పాటు రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, ఇతర సభ్యులు ఉన్నారు.

అధునాతన టెక్నాలజీతో జైళ్ల నిర్మాణం

- జైళ్లశాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్

కరీంనగర్ క్రైం, నవంబరు 21 : జిల్లాల్లో అధునాతన టెక్నాలజీతో జైళ్లను నిర్మిస్తున్నామని జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ ఎం సంపత్ అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని జైలు అధికారులు, సిబ్బందికి రెండు రోజుల పునశ్చరణ తరగతులు గురువారం కరీంనగర్ జైలులో ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ హాజరై మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో అధునాతన టెక్నాలజీతో జిల్లా జైలును నిర్మిస్తున్నామన్నారు. ఇతర జిల్లాల్లో కూడా అధునాతన టెక్నాలజీతో జైళ్లను నిర్మించి, ఖైదీల రద్దీని తగ్గిస్తామని తెలపారు. మరో అతిథి శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ జైళ్ల శాఖ తీసుకుంటున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, సంస్కరణలు గురించి కొనియాడారు. కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రీజినల్ లెవల్ రిట్రీట్‌లో భాగంగా ఖైదీల సంక్షేమం, సిబ్బంది సంక్షేమం, క్రమశిక్షణ, ఆరోగ్యం, సెక్యూరిటీ గురించి చర్చించి భవిష్యత్తులో జైళ్ల శాఖ ప్రతిష్టను పెంపొందించే విధంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జైలు వైద్య అధికారి డాక్టర్ కె వేణుగోపాల్, సైకియాట్రిస్ట్ ఎల్ వర్షి, అప్పన్న గారి వెంకట్రావు, జైలర్స్ పి శ్రీనివాస్, రమేష్, పర్శరామ్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సుధాకర్‌రెడ్డి, రమేష్, సంగీత, మినిస్టీరియల్, మెడికల్ సిబ్బంది, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ నిజామాబాద్ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్

ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

- జడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

సుభాష్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని జడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి గ్రామంలోనైనా ఆరు గ్యారంటీలు అమలు అయినట్లు రుజువు చేస్తే మా నాయకులు రాజీనామాకు సిద్ధమన్నారు. తెలంగాణలో మీరు నిర్ణయించుకున్న గ్రామానికి మీ ముఖ్యమంత్రిని, పీసీసీ అధ్యక్షుడిని రమ్మనలాలని, కేటీఆర్‌తో మేము వస్తామని ఆరు గ్యారంటీ పథకాలు అమలు అవతలేవంటే మీ ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. గ్రామంలో పథకాలన్నీ అమలైతే తప్పక మా నాయకులు రాజీనామా చేస్తారన్నారు. ఏ గ్రామమో మీరు వెంటనే వెత్తుకోవాలని అన్నారు. ఆ గ్రామానికి మా నాయకుడు కేటీఆర్, జీవన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలు వస్తారని అన్నారు. అక్కడే పథకాల అమలుపై తేల్చుకుందామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలో రూ.2లక్షల రుణమాఫీ జరగలేదన్నారు. రైతుభరోసా ఊసేలేదని అన్ని రకాల పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి ప్రస్తుతం సన్నాలకే బోనస్ అని మాటమార్చారని అన్నారు. కౌలు రైతులకు ఇస్తానన్న రైతుభరోసా ఏమైందని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని అన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఇస్తామన్న పెన్షన్ ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు సిర్పరాజు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సత్యప్రకాశ్, తెలంగాణ శంకర్, శేఖర్, నర్సాగౌడ్, విజయ్‌కుమార్, కాశీచరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 5తులాల బంగారం, 20తులాల వెండి అపహరణ

ఖిల్లా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన నగరంలోని నాల్గో టౌన్ పోలసు స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మీనగర్‌లో గురువారం వెలుగులోకి వచ్చింది. మహాలక్ష్మీనగర్‌కు చెందిన ప్రశాంత్‌గౌడ్ ఇంటికి తాళం వేసి బుధవారం ఆర్మూర్‌లోని తన బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లారు. ఇంటికి తాళం ఉన్న విషయాన్ని గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డారు. ఇంటిలోని బీరువాను ధ్వంసం చేసి అందులో గల 5తులాల బంగారు ఆభరణాలు, 20తులాల వెండి వస్తు వులను ఎత్తుకెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చిన ప్రశాంత్ గౌడ్ ఇంటి తాళంపగులగొట్టి ఉం డడంతో పాటు ఇంట్లోని బీరువాలోని వస్తువులు సైతం చిందరవందరగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నాల్గో టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ ఘటన స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్సై

సౌదీలో నర్సింగ్‌పల్లి వాసి మృతి

మోపాల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ జమాల్ (56) సౌదీలో గుండెపోటుతో బుధవారం రాత్రి మరణించినట్లు గ్రామస్థులు తెలిపారు. 2007లో సౌదీకి వెళ్లాడని అప్పటి నుంచి ఇప్పటి వరకు అక్కడే పనిచేస్తూ స్వగ్రామానికి వస్తూ పోతుండేవాడని గ్రామస్తులు తెలిపారు. సౌదీలో మృతి చెందిన వార్త కుటుంబ సభ్యులకు తెలియడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గత కొన్నిరోజుల క్రితం షేక్ జమాల్‌కు గుండెపోటు రావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే ఆపరేషన్ కూడా జరిగిందని గ్రామస్తులు తెలిపారు. బుధవారం రాత్రి హటాత్తుగా మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. స్వగ్రామానికి మృతదేహం రావడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.



మాట్లాడుతున్న టీయూసీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

పెరిగిన ధరలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

సుభాష్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర ధరలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కార్మిక రైతు సంఘాల ఐక్యకార్యచరణ కమిటీ పిలుపునిచ్చింది. జిల్లా కేంద్రంలోని హమాల్‌వాడిలో గల సీఐటీయూ కార్యాలయంలో కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, సంఘాల ఐక్య కార్యచరుణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రైతు ఉద్యమం సమయంలో దేశ రైతాంగానికి ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని, ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే చర్యలను ఆపాలన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఉద్యోగ ఆరోగ్య భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబరు 26న దేశ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో 26న జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.దాసు, ఏఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ప్రభాకర్, భాస్కర్, వెంకటేశ్, సాయన్న, రమేష్‌బాబు, శివకుమార్, గంగారెడ్డి, రాజేశ్వర్, గణేష్, సాయిబాబా, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గురువారం డీఈవో అశోక్‌కు ఉద్యోగులు సమ్మె నోటీసును అందజేశారు. ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే వరకు మినిమం టైంస్కేల్, జీవిత బీమా రూ.20లక్షలు, ఆరోగ్య బీమా రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్‌ల కింద రూ.25లక్షలు అందజేయాలన్నారు. డీఈవోను కలిసిన వారిలో గౌరవ అధ్యక్షుడు అష్రఫ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకోవడం అభినందనీయం

- టీయూ వీసీ యాదగిరిరావు

డిచ్‌పల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖవి తెలంగాణ ఉర్దూ అకాడమిచే పరిశోధన-విమర్శ రంగంలో లైఫ్ టైం అచీవెమెంట్ అవార్డు అందుకోవడం అభినందనీయమని టీయూ వీసీ యాదగిరిరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీసీ యాదగిరిరావు రిజిస్ట్రార్ ఎం.యాదగిరి డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖవిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఖవికి టీయూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పున్నయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌బాబు, ఉపాధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణరెడ్డి, కోశాధికారి డాక్టర్ నాగరాజు, డాక్టర్ జమీల్, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ నీలిమ, ఇతర అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని పురాతనమైన సంత్ ఆచార్య మఠం దత్తాత్రేయ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా కార్తీక మాసంలో నిర్వహించే పూజలో భాగంగా వేదపండితులు వేదపారాయణం పఠించారు. దత్తాత్రేయుడికి వేదమంత్రాలతో పంచామృత అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పండితులు దత్తపారాయణం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దత్త పాదుకలతో పల్లకిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు మనోహర్, యోగేశ్, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nirmal Branch, Dist. Nirmal agreed to accord Loan to Velma Suresh S/o Velma Naganna, Aged 47 Yrs, Occ:Business, R/o H.No.5-1, Argul (V) Jakranpally (M), Nizamabad (Dist) mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.

Hence this notice

SCHEDULE OF THE PROPERTY

That the Open Place in Survey No. 263/P1 (Through NALA conversion Proceeding No. 2400578472 Dated. 28.08.2024) admeasuring total site area of Open place = 1,71,517.00 Sq.fts or 19,057.50 Sq.Yds or 15,933.97 Sq.Mtrs situated at Argul Village of Jakranpally Mandal, Nizamabad District Within the limits of Gram Panchayat Argul, under the jurisdiction of Regn.Sub Dist Armoor, Regn. Dist. Nizamabad.

Bounded as below

North: Open place of Velma Suresh, **South:** Land of Praveen Reddy, **East:** N.H.44 Main Road, **West:** Land of Gaddam Vikram Reddy

Sd/- R. Jagadishwer Rao
B.Com, LLB.,Advocate,
H.No. 6-2-67, Subhash Nagar,
Nizamabad, Ph: 9848094409



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.190	రూ.270	రూ. 295
వెన్‌కాబ్(కిలో)	: రూ.200	రూ.280	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.79400	రూ.73200	రూ.960

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అమరన్ (12.00, 3.30, 7.00, 10.30)
స్క్రీన్-2 : మెకానిక్ రాకీ (11.45, 3.00, 6.15, 9.30)
స్క్రీన్-3 : మందిర (10.45)
: కనక మహాలక్ష్మి (1.30)
: క (4.00)
: జీబ్రా (7.15, 10.40)
స్క్రీన్-4 : లక్కీ భాస్కర్ (1.00, 7.05)
: దేవకినందన వసుదేవ (4.15, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మెకానిక్ రాకీ (10.30, 10.20)
: దేవకినందన వసుదేవ (1.30, 7.30)
: లక్కీ భాస్కర్ (4.30)
స్క్రీన్-3: అమరన్ (10.20, 7.30, 10.30)
: జీబ్రా (1.30)
: మెకానిక్ రాకీ (4.30)

దేవి : మెకానిక్ రాకీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కంగువా (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: దేవకినందన వసుదేవ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్